ఈ దేశమేగతి బాగుపడునోయ్!

- డి. కామేశ్వరి

"అరె, అమ్మగారీయాళ సినిమా చూపిస్తారన్నారు, బేగి బువ్వ తిని రమ్మన్నారు" పదేళ్ల యాదగిరి తూనీగలా పరిగెత్తి 'సంజయ్‌నగర్' వాడ వాడంతా అందరికీ ఆ వార్త చెప్పేశాడు.

ఆ 'అమ్మగారు'... అంటే రాణి విమలాదేవి, ఆ వాడలో అంటే నూరు నూటపాతిక ఇళ్లకి మకుటం లేని మహారాణి! జమీందారీలు పోయి ఏ నాడో అయినా ఆవిడలో అందం, ఠీవి, దర్పం, రాజరికం అన్నీ కలిసి ఇంకా రాణిగానే కన్పిస్తుంది ఎవరికైనా. జమీనులు, జమీందారీలు పోయాక పల్లెలో భూములు, తోటలు అన్నీ అమ్ముకుని సిటీలో పెద్ద బంగళా కొనుక్కుని స్థిరపడిపోయారు జమీందారు గారుండగానే. ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో ఇంజనీరు. కూతురు, భర్త ఇద్దరూ లండన్‌లో డాక్టర్లుగా వున్నారు. నాలుగేళ్ల క్రితం హార్ట్ అటాక్‌తో జమీందారు గారు పోయాక విమలాదేవి ఆవిడ దృష్టిని 'సోషల్ వర్క్' మీదకు మళ్లించింది. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంది. కొడుకు అమెరికా వచ్చేయమన్నా తోచదని చెప్పి, వున్న డబ్బుని కాస్తా సద్వినియోగపరిచి మరు జన్మకి కాస్త పుణ్యం కట్టుకోవాలన్నట్లుగా చేతనయినంతలో బీదా బిక్కకి సహాయపడడం మొదలుపెట్టింది. ఆగస్టు పదిహేనుకి, రిపబ్లిక్ డేకి ఆ వాడలో జండా ఎగరేసి మిఠాయిలు పంచుతుంది. పండుగ దినాల్లో అనాథాశ్రమాల్లో అన్నదానాలు చేస్తుంది. గాంధి జయంతికి ఆస్పత్రులలో పళ్లుఫలాలు పంచుతుంది. పాత బట్టలు పోగు చేసి అనాథాశ్రమానికి యిస్తుంది. ఏ శరణాలయాల వారు వచ్చినా లేదనకుండా తోచిన సహాయం చేస్తుంది. కుష్టు రోగుల ఆశ్రమాలు, ఓల్డ్ ఏజ్ హోమ్‌లని దర్శించి తోచిన సహాయాలు అందిస్తుంది.

ఆ వాడలో చిన్నా పెద్దా అందరికీ ఆవిడ తలలో నాలిక అయిపోయింది, కొద్ది రోజులలోనే. మొగుడు పెళ్లాల తగువుల దగ్గర్నుంచి, కరెంటు పోయినా, పంపుల్లో నీళ్లు రాకపోయినా, మున్సిపాలిటి చెత్త డబ్బాలు తీయకపోయినా, రోగాలు వస్తే ఏ డాక్టరు దగ్గిరకు వెళ్లాలో చెప్పడం మొదలు అన్నీ ఆవిడే చూస్తుంది. కావల్సినప్పుడు అప్పులు ఇచ్చి ఆదుకుంటుంది. ఉద్యోగం సిఫార్సులు చేస్తుంది. పదో పరకో చిన్న అప్పులు మళ్లీ అడగదు. పెళ్లాలని చితకబాదే మొగుళ్లని పిలిచి చివాట్లు పెడుతుంది. రిక్షాల వాళ్లకి హామీ వుండి బ్యాంకు లోన్లు ఇప్పిస్తుంది. ఆ వాడలో ఇద్దరు తెలివైన పిల్లలకి జీతాలు కట్టి చదివిస్తోంది. ఆ వాడలో ఆడపిల్లల పెళ్లిళ్లకి పుస్తె, పట్టుచీర ఆవిడే ఇస్తుంది. ఈ కారణాలన్నింటితో ఆ వాడలో ఆమె మాటకి తిరుగులేదు. ఎదురుచెప్పే సాహసం ఎవరికీ లేదు. బంగళా కట్టుకున్నాక దాని ఎదుట వెలిసిన ఖాళీ స్థలంలో సంజయ్ నగర్ బస్తీని మొదట 'ఏమిటీ గోల, పాడు సంత' అని జమీందారుగారుండగా విసుక్కుని కంప్లైంట్ చేసే ఆవిడ ఈనాడు చిత్రంగా ఆ బస్తీలో భాగం అయిపోయింది. ఆ వాడలోని ఒకరు పనిమనిషి, ఇంకొకామె వంట చేస్తుంది - ఇంకోడు తోట పనీ చేస్తారు. వాళ్ల తిండి బట్ట అంతా ఆవిడదే. విదేశాల్లో వున్న పిల్లలకి తన డబ్బు అక్కరలేదు. భర్తగారు మిగిల్చిపోయిన ఈ డబ్బు సద్వినియోగం చేస్తున్నందుకు ఆవిడకి సంతోషంగానే వుంది.

ఆవిడ దగ్గిర ఓ మూవీ కెమేరా, 16 ఎమ్.ఎమ్. ప్రొజెక్టరు వుంది. నెలకో, పదిహేను రోజులకో ఆవిడ ఓసారి సినిమా చూపిస్తూంటుంది. బంగళా ముందరి ఖాళీ స్థలంలో అందరినీ కూర్చోపెట్టి - పిల్లలకి పనికొచ్చే డాక్యుమెంటరీలు, పెద్దలకి పనికొచ్చే భక్తి సినిమాలు చూపిస్తూంటుంది.

ఆవిడ నాలుగు నెలల క్రితం యూరప్, అమెరికా అంతా తిరిగి వచ్చింది. కొడుకు దగ్గరో నెల, కూతురి దగ్గరో నెల వుండి పదిహేను రోజుల క్రిందటే వచ్చింది. విదేశాల్లో తను షూట్ చేసిన చిత్రం ఆ రోజు ఆ వాడలో చూపడానికి అందర్నీ పిలిచింది.

ఏడు గంటలయింది. అంతా, బంగళా ముందు గుమిగూడారు. సినిమా మొదలైంది. "అరే, ఇంగ్లీషు సినిమారా - ' ఎవరో అన్నారు. హిందీ, తెలుగు కానందుకు కాస్త నిరాశ పడ్డారు. ఈలోగా విమలాదేవి లోపల్నుంచి వచ్చింది. ఆపరేటర్ వంక అపమన్నట్లు చూసింది. సినిమా ఆగి, లైటు వెలిగింది. "చూడండి, ఇవాళ నేను చూపిస్తున్నది మామూలు సినిమా కాదు - మీకోసం అని ప్రత్యేకంగా తెచ్చాను. ఇది ముందు మీరు చూడండి, దీని గురించి సినిమా అయ్యాక నేను చెప్తాను. ఓ గంట కంటే వుండదు - చూసిం తర్వాత అంతా మీకు విశదపరుస్తాను."

తెల్లటి బారెడు జరీ అంచు వెంకటగిరి చీరతో, హుందాగా వచ్చి కూర్చున్న ఆవిడ ఎదుట అంతే నిశ్శబ్దం అయిపోయారు.

సినిమా మొదలైంది. కెమెరా యూరప్‌లో అన్ని కంట్రీలలో రోడ్లు చూపిస్తోంది - ప్రతి రోడ్డు విశాలంగా, శుభ్రంగా, ఎక్కడా ఓ కాగితం ముక్క కూడా కనపడకుండా పరిశుభ్రంగా వుంది. కార్లు చీమల్లా బారులు తీరి ఇటు నాలుగు వరుసల్లో, అటు నాలుగు వరుసల్లో వెడుతున్నాయి. రోడ్ల మధ్య ఫ్లై ఓవర్లు.. ఇటు అటు దారులు చెప్పే బోర్డులు... అంతా ఎంతో సిస్టమేటిక్‌గా వుంది. ప్రతి వారు ఎక్కడ పడితే అక్కడ ఉచ్చలు, ఉమ్ములు పోయకుండా యూరినల్స్ ఉపయోగిస్తున్నారు - ఆ బాత్‌రూములన్నీ కొత్త వాటిల్లా నీట్‌గా కళకళలాడుతున్నాయి. రైలు స్టేషన్లు అయినా, ఏరోడ్రోముల్లో అయినా, బజార్లలో అయినా ప్రతి చోటా యూరినల్స్, బాత్‌రూములున్నాయి. ఆఖరికి ఉమ్ములకి డస్ట్‌బిన్స్ ఉపయోగిస్తున్నారు జనం - చక్కని రోడ్లు, లైనుగా చూడముచ్చటయిన ఇళ్లు, కన్నుల పండువుగా కనిపిస్తూంది. ఎక్కడ చూసినా శుభ్రంగా, దుమ్ము ధూళి, చెత్త అన్నదే లేకుండా పరిశుభ్రంగా వుంది. ప్రతిచోట చెత్త డబ్బాలున్నాయి. సిగరెట్టు కాల్చినా, ఐస్‌క్రీమ్ తిన్నా, కూల్‌డ్రింక్ తాగినా అవి

ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా అందరూ జాగ్రత్తగా చెత్త డబ్బాలో వేస్తున్నారు. ఓ రెండేళ్ల పాప చాక్‌లెట్ కాగితం విప్పి నోట్లో పెట్టుకుని కాగితం చిట్టి చేతులతో డబ్బాలో వేసింది - ఇంకోరు అరటి పండు తిని చుట్టూ చూసి పది పదిహేను గజాలు నడిచి డబ్బా దగ్గరికి వెళ్లి పడేసారు... ఆ తరువాత కెమేరా ఓ ఇంట్లో వంటిల్లు చూపింది. అందులో గృహిణి వంట చేస్తూ తరిగిన కూరల తుక్కు అంతా వంటింట్లో ఓ మూల డబ్బాలో వున్న ప్లాస్టిక్ సంచిలో వేసి మూతపెట్టింది. మరో సీనులో ఇంకో గృహిణి ప్లాస్టిక్ డబ్బాలో కవరు నిండడంతో ఓ మూట కట్టి కారు గ్యారేజిలో పెట్టిన ఓ పెద్ద ప్లాస్టిక్ డ్రమ్‌లో పెట్టింది... తరువాత సీను ఇంటి యజమాని ఉదయం ఆ ప్లాస్టిక్ డ్రమ్ తీసికెళ్ళి ఇంటి ముందు రోడ్డు మీద పెట్టాడు. అందరిళ్ల ముందు అలాంటి డబ్బాలు, ప్లాస్టిక్ సంచుల మూటలు అందరూ పెడ్తున్నారు... దూరం నుంచి గార్‌బేజ్ వ్యాను వస్తూ అందరింటి ముందు సంచుల మూటలు వేన్‌లో తీసికెళ్లారు.. గార్‌బేజ్ వ్యాను ఊరి చివర చేర్చిన సంచులన్నీ పెద్ద పెద్ద మిషన్లు క్రష్ చేసి పడేస్తున్నాయి పెద్ద గోతిలో - తరువాత మళ్లీ కెమేరా ఓసారి రోడ్లు, ఇళ్లు, శుభ్రంగా నీట్‌గా వున్నట్లు చూపించింది - సినిమా అయిపోయింది. లైటు వెలిగింది.

"అయిపోయిందా, ఇంతేనా సినిమా -" అనుకున్నారంతా. కుర్రాళ్లైతే పైకే అన్నారు.

"చూశారుగా ఈ సినిమా - ఇది మామూలు సినిమా కాదు. నేను విదేశాలు వెళ్లినప్పుడు మీకు చూపించడం కోసం ప్రత్యేకంగా తీసి తెచ్చాను. ఈ సినిమా మీకెందుకు చూపానో అర్థమైందా" రాణి విమలాదేవి అందర్నీ ఉద్దేశిస్తూ అంది.

"చూశారుగా ఆ దేశాలలోని ఊర్లన్నీ ఎంత శుభ్రంగా - ఒక్క కాగితం ముక్కయినా రోడ్ల మీద కనపడదు. చూస్తే ఎంత ఆశ్చర్యం వేసిందీ - ఆ వూర్లు అన్నీ చూస్తూంటే మన దేశం గుర్తు వచ్చి ఎంత బాధ కలిగిందో - మన దేశంలో రోడ్లు, కుళ్ళు కాల్వలు, ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, మన దేశంలో ట్రాఫిక్... రోడ్ల మీదే ఉచ్చలు, దొడ్లు అన్నీ గుర్తువచ్చి సిగ్గుతో తలవంచుకున్నాను... ఆ క్షణంలోనే అన్పించింది - మనం ఇంత అధ్వాన్న స్థితిలో ఎందుకున్నాం?.. స్వతంత్రం వచ్చి నలభై ఏళ్లయినా ఇలాగే మురికి గుంటల్లో పందుల్లా ఎందుకు బతుకుతున్నాం... ఇది ప్రభుత్వ లోపమా, ప్రజల్లో లోపమా... మన దేశం బీద దేశమైనా... బీదరికానికి, పరిశుభ్రతకి సంబంధం ఏముంది? బీదవారైనంత మాత్రాన ఇల్లు - వీధి - వూరు శుభ్రంగా వుంచుకోడానికి ఏం సంబంధం వుంది? అన్నిటికీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టే ముందు మనల్ని మనం బాగు చేసుకోడానికి ప్రయత్నించాలి. మన ఇల్లు శుభ్రం చేసుకున్నట్టే - మన వీధి వుంచుకోవాలి - ఒక్కో వీధి వారు ఎవరి వాడ వారు శుభ్రంగా వుంచుకుంటే వూరు మొత్తం అదే శుభ్రం అవుతుంది... మనం చెత్త ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా అలాగే సంచులలో కట్టి మున్సిపాలిటీ వ్యాన్ వచ్చినప్పుడు పడేస్తే మన వీధులు ఎంత శుభ్రంగా వుంటాయి. ఇంత చిన్న విషయం మనం ఎందుకు చేయం. ప్రతివారూ వీధులు శుభ్రం చేయడం మున్సిపాలిటి పని అనుకునే బదులు, మనం వారితో ఎంతవరకు సహకరిస్తున్నాం అని ఆలోచించుకుని మనవంతు సహాయపడ్డాక అప్పుడు ప్రభుత్వం చేయలేదంటే ప్రజలు తిరగబడాలి. మీరు ఈ సినిమా చూశాక మన రోడ్లు, మన వీధులు, మన ఊర్లు అలా వుండాలని మీకు అనిపించడం లేదా?" విమలాదేవి అందర్నీ ఉద్దేశిస్తూ అడిగింది. అందరూ అంగీకారంగా తలలూపారు.

"కానీ అమ్మగోరూ... మనం అట్టా ఎట్లాగుండగలం అమ్మా..."

"ఏం ఎందుకుండలేం... మన చెత్త రోడ్ల ముందు కుప్పల్లా పారేసే బదులు సంచుల్లో కట్టిపెట్టే మాత్రం కూడా మనం చెయ్యలేమా... ఆ మాత్రం మనచుట్టూ శుభ్రంగా వుంచుకోగలం గదా... ఎవరికి వారు ఆ మాత్రం చేస్తే ఊరు బాగుపడదా -"

"ఆ సంచులు ఎంత ఖరీదుంటాయి..." ఒకరి సందేహం.

"ఎంతుంటుంది - మహా అయితే రూపాయో, రెండో అనుకోండి - వారానికి ఓ రెండు చొప్పున నెలకి ఎనిమిది అయినా... ఓ పదో పదిహేనో అవుతుంది నెలకి. నెలకి పది రూపాయలు ఖర్చు పెట్టలేని స్థితిలో ఎంత బీదవారు కూడా లేరని నా ఉద్దేశం. మీరు వారానికి ఓ సినిమా కోసం ఖర్చు పెట్టే కంటె తక్కువే. మీ ఇల్లు, వూరు శుభ్రంగా వుంచుకోడానికి ఆ మాత్రం త్యాగం చెయ్యలేరా..." విమలాదేవి అందరి వంక చూసింది.

"అమ్మగోరూ... పదిహేను రోజులకోసారైనా చెత్త లారీ రాదమ్మ గోరూ... ఈ మూటలు ఇంట్లో ఎన్నాళ్లెట్టుకుంటాం - " మరొకరి సందేహం.

విమలాదేవి అంగీకారంగా తల పంకించింది. "అవును నిజమే... విదేశాల్లో పట్టణాలలో అయితే వారానికి రెండు రోజులు, గ్రామాలలో వారానికి ఒకసారి ఖచ్చితంగా అన్న రోజుకి వచ్చి చెత్త సంచులు తీస్తారు. మన దేశంలో అలా లేని మాట నిజమే... కాని మనం ఏదీ ఒక రోజులో సాధించలేం. క్షణాలలో ఏ మార్పూ రాదు... ముందు మనం ఏం చెయ్యగలమో చేసి చూపించితే, ప్రభుత్వాన్ని మీరూ మీ పనులు సక్రమంగా చెయ్యడం లేదని వేలెత్తి చూపించగలిగే అర్హత, అధికారం మనకొస్తుంది అని నా నమ్మకం - చెత్త లారీ వచ్చే వరకు ఈ మూటలు మీ వీధిలో ఇంటి ముందు నాలుగైదు ఇళ్లకి ఓ పాత ఆయిల్ డ్రమ్ము కొని... పనికిరాని ఏ సిమెంటు నీళ్ల కుండీల్లాంటి వాటిల్లోనో పెట్టి మూత పెట్టి వుంచండి. మీ వీధిలో పిల్లల్ని మలమూత్రాలకి రోడ్డు మీద కూర్చోపెట్టడం మానండి. అదెంత అసహ్యకరమైన విషయమో ఆలోచించండి. ఆ విదేశీ చిత్రం చూశాక మనం ఎంత అసహ్యకరమైన వాతావరణంలో వున్నామో అర్థం చేసుకోండి-" తీవ్రంగా అంది ఆవిడ.

"అమ్మగోరూ... ఈ వాడంతటికీ రెండే మరుగు దొడ్లున్నాయి. పెద్దలకే అవి చాలడం లేదు. పిల్లలని అందుకే రోడ్ల మీదకి పంపుతున్నాం..."

"అమ్మగోరూ... ఆ పాయిఖానాల్లో నీళ్లు సరిగా పోయరు. ఓ పంపు వుంటే బాగుంటుందమ్మా.. ఎల్లాలంటే రోత పుడ్తోంది..." మరొకరు.

విమలాదేవి అందరి వంకా చూసింది. "నే చెప్పినట్లు మీరంతా చేస్తానంటే మీకోసం ఈ వున్న బోరింగు పైపుతో పాటు మరోటి తవ్వించి బాత్‌రూమ్ ఒకటి కట్టించి అందులో నీళ్ల పంపు పెట్టిస్తాను. కాని ఆ తరువాత ఈ వాడలో కాగితం ముక్క కూడా కనపడదని మీరంతా హామీ ఇవ్వాలి నాకు - మీ పిల్లలూ రోడ్లు పాయిఖనా చెయ్యరని నాకు మాటివ్వాలి."

"అమ్మగోరూ... మీ మాటకి ఎప్పుడన్నా ఎదురు చెప్పామా -" అంతా ముక్త కంఠంతో అన్నారు.

"సరే బోరింగు తవ్వించి, పాయిఖానా కట్టించి... మీ అందరికీ ఒక నెల ప్లాస్టిక్ సంచులు తెప్పించి ఇస్తాను. ఈ నెల ఒకటో తారీఖు నుండి, అంటే ఇంకో పదమూడు రోజుల నుంచి మనం మన పథకం ఆరంభించాలి. మనల్ని చూసి మిగతా వీధులు అన్నీ, మిగతా ఊరంతా మనల్ని ఆదర్శవంతంగా చేసుకునేటట్లు మనం నడుచుకోవాలి. వారానికి ఓ సారైనా వచ్చి మన చెత్త సంచులు తీయించడానికి మున్సిపాలిటీ వారితో మాట్లాడతాను. మీరంతా నా వెనక నిలబడి చేయూతనిస్తే చాలు..." అందరూ అంగీకారంగా తలలూపి సంతోషంగా చప్పట్లు కొట్టారు... అందరిలో ఏదో కొత్త ఉత్సాహం... ఏదో సాధించబోతున్నట్లు ఉత్తేజం!

• • •

ఏప్రిల్‌ఫూల్ అనుకుని......

ఓసారి ఏప్రిల్ ఒకటోతారీఖున అమృత్‌సర్‌లోని 'భాన్‌డాక్లాత్‌స్టోర్స్'లో నిప్పు అంటుకుంది. ఫైర్‌బ్రిగేడ్‌కి ఫోన్‌చేసినా రాలేదు వాళ్ళు. సుమారు ఇరవై నిమిషాల్లో 15 సార్లు ఫోన్ చేసినా ఫైర్‌బ్రిగేడ్‌వాళ్ళు శ్రద్ధ చూపలేదు. ఎవరో ఏప్రిల్‌ఫూల్ చేస్తున్నారని అనుకున్నారట! గట్టిగా అరిచి బెదిరించి ఫోన్‌చేస్తే, అప్పుడు వచ్చారు! అప్పటికి షాపంతా కాలిపోయి బూడిదయింది. సుమారు పదిలక్షలు విలువచేసే బట్టలు 'ఏప్రిల్‌ఫూల్' భ్రమకారణంగా కాలిపోయి, మసి అయ్యాయి.

విమలాదేవి అన్నట్లుగానే సరిగ్గా ఫస్ట్ తారీకు లోపల బోర్‌వెల్ తవ్వించి, ఓ బాత్‌రూము కట్టించి మూడింటికి పైపు కనెక్షన్లు పెట్టి, అందరికీ ఓ నెలకి సరిపడ ఇంటికి 8 చంతున ప్లాస్టిక్ కవర్లు పంచి పెట్టింది. ఇచ్చే ముందు తను ప్రతిరోజూ వచ్చి చూస్తానని చెప్పి మరీ ఇచ్చింది. మొత్తం ఓ ఇరవై వేలు ఖర్చు పెట్టింది ఆవిడ. కార్పొరేషన్ ఆఫీసుకి వెళ్లి కమీషనర్‌తో మాట్లాడింది. ఆయన ఆవిడ అభ్యర్థనని ఆశ్చర్యంగా విన్నాడు. ఆవిడ చెప్పిందంతా విని మెచ్చుకోలుగా చూశాడు.

"మీలా నూటికొకరయినా వుంటే ఈ దేశం బాగుపడ్తుందేమోనన్న ఆశ కలుగుతోంది. డబ్బున్న వాళ్లు చాలామంది వుండొచ్చు. ఆ డబ్బుని సద్వినియోగపర్చి నలుగురికీ ఉపయోగించే విధంగా ఖర్చు పెట్టాలనుకున్న మిమ్మల్ని అభినందించకుండా వుండలేకపోతున్నాను... మీరు చేపట్టిన ఈ పథకం విజయవంతమయితే ప్రతి వాడలో మీలాంటి డబ్బుగలవారు ముందుకు వచ్చి తమ పరిసరాలు శుభ్రంగా వుంచుకోడానికి ఇది స్ఫూర్తినిస్తుందని ఆశిస్తాను... ఈ పథకం ఆరంభించిన మీరే ఈ పథకం నాలుగు మూలలా విస్తరించడానికి పాటు పడ్తారని ఆశిస్తాను. మీ ఈ ప్రయత్నానికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ లభిస్తాయి. తప్పకుండా మీరు కోరినట్లు చెత్త తీయించే ఏర్పాటు చేస్తాను.. కాని మీకు తెలియంది ఏముంది. ఈ మున్సిపాలిటీ పనితీరు, పనివారు, లారీలు తగినన్ని లేని లోటు, వున్నవారైనా సరిగ్గా డ్యూటీ చేయకపోవడం, ఏదన్నా అంటే స్ట్రయికులు... ఏదన్నా ఏక్షన్ తీసుకుందామన్న పాలిటీషియన్స్ జోక్యం... గవర్నమెంటులో పని తీరుతెన్నులు మీకు తెల్సు గదా... ఈ దేశం ఏమాత్రం బాగుపడాలన్నా మీలాంటి ప్రజలే జోక్యం కల్గించుకోవాలి... దేశం మనకేమిచ్చింది అనుకోకుండా మనం దేశానికి ఏమిస్తున్నాం అన్న మంచి మాట గుర్తుంచుకోవాలి అందరూ మీలాగా -" అంటూ చిన్న లెక్చరిచ్చి ఆవిడకి సహాయ సహకారాలు అందిస్తానని మాట ఇచ్చాడు.

వారం పదిరోజుల్లో నిజంగానే ఆ వాడ రూపు మారిపోయింది. ఇచ్చిన మాట ప్రకారం ప్రతివారూ ఇంటి ముందు, సందు ముందు చెత్త పోయకుండా సంచుల్లో పెట్టి డ్రమ్ములలో పెట్టారు. వీధిలో వున్న ఆడవాళ్లు వంతుల వారిగా ఇద్దరు ముగ్గురు కల్సి వీధులు తుడిచారు. పిల్లలు రోడ్లు పాయిఖానాలు చెయ్యకుండా బుద్ధిగా లావెట్రి ఉపయోగిస్తున్నారు. విమలాదేవి ప్రత్యేకంగా పనికట్టుకుని రోజూ ఒకసారి ఆ వీధుల వెంట రెండు మూడుసార్లు తిరిగివచ్చేది.

ఆ రోజు చెత్త లారీ వచ్చింది. ఆ వీధిలో చెత్త డబ్బా చుట్టూ ఎప్పుడూ పొంగి పొర్లుతూ వుండే చెత్త లేదు! వారిని చూసి అందరూ కట్టిపెట్టిన సంచులు తీసుకొచ్చి వీధి చివర పెట్టారు. అది చూసి మున్సిపాలిటీ వర్కర్లకి ఆశ్చర్యంతో పాటూ, ఆనందం కల్గింది. ఆఫీసుకి వెళ్లాక వర్కర్సందరితో ఈ సంగతి చెప్పారు. అంతా కల్సి చర్చించారు. కూడబలుక్కున్నారు. "మనం ఇంక యిట్టా చెత్త కుప్పలు తీయద్దు - అట్టా సంచులలో కట్టి పెడ్తేనే తీద్దాం... ఆ వీధి వాళ్లంతా చక్కా ఎట్టా ఎత్తిపెట్టారు సంచుల్లో.. అందరూ ఆళ్లని చూసి అట్టాగే చెయ్యాలని చెపుదాం... మనం చెత్త కుప్పలు ఎత్తం అంటే, అంతా అట్టాగే పెడతారు... కాదంటే స్ట్రయిక్ చేద్దాం." అంతా కల్సి నిర్ణయించారు. ఆఫీసర్లకి కబురు చేరింది. వాళ్లూ ఆశ్చర్యంగా విన్నారు. కమీషనర్ గారి దగ్గరకు కబురు చేరింది. ముందే తెల్సిన వాడవడం వల్ల ఆయన ఆశ్చర్యపడలేదు... "అవును నిజంగా మన నగరం ఆ వీధిలా మారితే మన దేశానికి మంచి రోజులు వచ్చాయని ఆనందపడొచ్చు. కానీ అది ఒక రోజులో జరిగే పనా..."

"ఎందుకు కాదు సార్ - మీరు పేపర్లో నోటీసులు వేయించండి. చెత్త కుండీలలో వేస్తే చెత్త తీయరని - సంచుల్లో కట్టి పెట్టాలని రూలు పెట్టామని మున్సిపాలిటి నోటిఫికేషన్ వేయండి. ప్రతిచోట పోస్టర్లు అంటింపచేయండి... జనంలో వెంటనే కాకపోయినా కొద్ది రోజులలో మార్పు వస్తుంది సార్ -" కమీషనర్ పర్సనల్ సెక్రటరీ అన్నాడు.

"నోటీసులతో ప్రజలలో మార్పు వస్తుందంటవా... ప్రతివాళ్లల్లో సివిక్ సెన్స్ వుండాలి గాని... మనం ఏదో చేద్దాం అనుకున్నా ఈ పాలిటీషియన్స్ సాగనిస్తారా? ప్రజలు మనకు కోపరేషన్ ఇస్తారా?" సందేహాలు వెలిబుచ్చాడు కమీషనర్.

"సార్, ఏ మంచి పని మొదలుపెట్టినా ముందు తీవ్ర విమర్శలు ఎదుర్కోవాలి అన్నది మీకు తెలియదా సార్. రైలు ఇంజన్ కనిపెట్టిన నాటి నుంచి ఈ విమర్శలు ఎదుర్కొంటూనే వున్నారు. ప్రజలు వారంతట వారు శుభ్రత అలవర్చుకోకపోతే గవర్నమెంటు కఠినమైన రూల్సు పెట్టి అలవాటు చెయ్యాలంటాను. విదేశాల్లో అలా కాగితం ముక్క పారేసినా కఠినంగా ఫైనులు అవి వేయబట్టి గదా వారంతా శుభ్రత అలవరచుకున్నారు. ఏ మంచైనా అలవాటు పడడానికి టైము పడ్తుంది సార్. మనం చెత్త అలా విడిగా పోస్తే తీయం, సంచుల్లో ఎత్తిపెట్టాలని రూలు పెడితే జనం కొన్నాళ్లకయినా మారతారు సార్," సెక్రటరీ వినయంగా అన్నాడు.

"సరే, చూద్దాం. ముందు పేపర్లలో ఓ నోటిఫికేషన్ ఇవ్వండి - ఇటు ప్రజలు అటు పాలిటీషియన్స్ రియాక్షన్ ఎలా వుంటుందో చూద్దాం" కమీషనర్ ధైర్యంగా ఆర్డరు పాస్ చేసాడు.

ఇలాంటి నోటిఫికేషన్స్‌కి ఏం చలించం అన్నట్లు ఓ మూల పడిన వార్త ప్రజలు పట్టించుకోలేదు. ప్రభుత్వం దృష్టికీ రాలేదు. యథాప్రకారం చెత్త డబ్బాలు నిండాయి - నెలకొక సారన్నా వచ్చే చెత్త లారీలు రాకపోవడంతో చెత్త కుండీలు పొంగి పొర్లి రోడ్లన్నీ నిండాయి. ప్రజలలో కాస్త చలనం కల్గిన వాళ్లు మున్సిపాలిటి పని తీరును గురించి పత్రికల్లో ఉత్తరాల శీర్షికలో దుమ్మెత్తిపోశారు. పేపర్లు తీవ్రంగా విమర్శించాయి - క్రమంగా కొన్నాళ్లకి ఈ వార్త ప్రభుత్వం దృష్టికి వచ్చింది - మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రిగారు కోపంతో మండిపడ్డారు జరిగింది విని. కమీషనర్‌కి కబురు వెళ్లింది. ఎవరి అనుమతితో ఇలాంటి నోటిఫికేషన్ ఇచ్చావని మంత్రిగారు ఎగిరిపడ్డారు. కమీషనర్ వినయంగానే తను మనుష్యులలో మార్పు తెచ్చి, ఊరిని శుభ్రపరచాలన్న సదుద్దేశంతో చేసానని చెప్పిన మాట మరింత కోపం కల్గించింది ఆయనకి.

"రూల్సు, రెగ్యులేషన్స్ మార్చేయడం, కొత్త ప్రణాళికలు పెట్టేయడం, దేశాన్ని ఉద్ధరించేయడం అంతా మీ ఆఫీసర్లు చేసేస్తే ఇంక మేం ఎందుకు" అంటూ ఎగిరాడు.

"ఇచ్చేముందు నాకు చెప్పక్కరలేదా, నీకెవరిచ్చారు పవరు" ఆఫీసరు తను ఏ ఉద్దేశంతో చేసాడో చెప్పినా వినకుండా ఎగురుతున్న మంత్రిగారి

తను ఏనాడయితే పెళ్ళి చేసుకున్నాడో... ఏనాడయితే ఈ సుభద్ర పాలపడ్డాడో, ఆనాటినుంచి - స్వేచ్ఛా స్వాతంత్ర్యం అన్నీ పోయాయి. గానుగకి కట్టిన ఎద్దులాగా ఈ సంసారంలో పడి గిరగిర తిరుగుతున్నాడు. సుభద్ర తన పాలబడ్డదా? ఒకప్పుడు తను సుభద్రను చేసుకుందామని - ఆ సుభద్ర ద్వారా కొంత స్థిరత్వం గలుగుతుందని అనుకోలేదూ? అయితే ఈనాడు ఈ సుభద్ర ఈ సంసారం గుదిబండలవుతాయనుకోలేదు. పత్రికా ప్రపంచంలోకి అడుగిడటానికి సుభద్రతో పెళ్ళి కావాలనుకున్నాడు, సులభమైన మార్గం అనుకున్నాడు.

అయితే తను సుభద్రని కేవలం పత్రిక కోసమే పెళ్ళి చేసుకున్నాడా! అందరి యువకులకి మల్లేనే తోడు కావాలని చేసుకోలేదా? ఏమో చెప్పలేదు. ఒక వయస్సులో అవసరమయ్యే దేహవాంఛ లకి పెళ్ళి గమ్యమని చేసుకొని వుండవచ్చు. కానీ సుభద్ర తనిని ఏనాడూ లీల లాగా మానసికంగా ఉత్తేజపరచలేదు. శకుంతల వలే తనని మత్తులో ముంచనూ లేదు. గుంజకి కట్టబడిన గొడ్డు లాగా తానూ సుభద్ర అనే గుంజకి కట్టివేయబడ్డాడు. గొడ్డు చాకిరీ చేస్తున్నాడు. అంతేనా? తమ బాంధవ్యంలో అంతకి మించి మరి ఇంకేమీ లేదా? కేవలంగొడ్డు చాకిరియే సంసార బాధ్యతా?

\- మాలతీ చందూర్

(ఎన్ని మెట్లెక్కినా'లో అవధాని అంతర్మథనం)

ఆవేశం తగ్గేవరకు ఆగి - రాణి విమలాదేవి ఆరంభించిన ఈ ఉద్యమానికి చేయూతనిచ్చి ప్రోత్సహించితే ఊరు బాగుపడ్తుందన్న ఆశతో చేసానని చెప్పాడు. మంత్రిగారి భ్రుకుటి ముడిపడింది. "ఎవరా విమలాదేవి?'' కమీషనర్ జరిగింది వివరించాడు - మంత్రిగారు కుతూహలంగానే విన్నారు. కాస్త శాంతించాడు. "బాగానే వుంది. ఇలా ఒక్క రోజులో రూల్సు మార్చేసి ప్రజలని ఇబ్బందిపెడితే జవాబుదారి మాది... ముందు చెత్త తీయించండి... రోడ్లన్నీ నిండిపోయాయి. నేను ఈ విషయం ముఖ్యమంత్రి గారితో మాట్లాడాక ఆలోచిద్దాం.'' తమ పవరు, ప్రాముఖ్యత తగ్గకూడదని, ఆఖరి నిర్ణయం తమదే అని తేల్చారు మంత్రిగారు. ఆ మాత్రం దారికి వచ్చినందుకు సంతోషించాడు కమీషనర్.

• • •

"ఎవరావిడ?... ఎవరా విమలాదేవి? ఇదంతా ఎందుకు చేస్తోంది?'' మంత్రిగారు చెప్పిన వార్త విని ఆశ్చర్యంగా, కుతూహలంగా అడిగారు ముఖ్యమంత్రి - జనంలో, ఓ వీధిలోనయినా ఈ మాత్రం మార్పు తీసుకురాగలిగిందంటే... ఆవిడని చూడాల్సిందే. "ఐ లైక్ టు మీట్ హర్'' అన్నారాయన మంత్రితో.

విమలాదేవిని కలుసుకున్నాక ఆవిడ అందం, ఠీవి, రాచరికపు హెూదాలతో పాటు ఏదో చెయ్యాలన్న తాపత్రయం, దీక్ష, కృషి పట్టుదల అన్నీ నచ్చాయి ఆయనకి.

"విమలాదేవి గారూ, బాగానే వుంది మీరు చెప్పింది. ఊరు, దేశం బాగుపడాలని మాకూ వుంది. బాగుపడితే మాకు సంతోషమే. కాని మీరు ఒకటి మర్చిపోతున్నారు. ఆ దేశాలతో పోల్చుకోడానికి మనది బీద దేశం అన్న సంగతి మరవకండి. తిండికి గతి లేని వారెందరో వున్న ఈ దేశంలో నెలకి పదిహేనో, ఇరవయ్యో పెట్టి సంచులు కొనే స్థితిలో అంతమంది వున్నారా. అంతేకాక వున్న యూరినల్స్ శుభ్రత లేకుండా కంపు కొడ్తున్నాయి. వారిలా మనకి నీటి వనరులు లేవు. ఎక్కడ పడితే అక్కడ బోరింగులు తవ్వించి, యూరినల్స్ కట్టించి మెంటైన్ చెయ్యడానికి మనకు గ్రాంటులు ఏవి, తాగడానికే నీరు లేని బీద దేశం మనది...''

"క్షమించండి సార్... మీరు చెప్పినట్లు మనది బీద దేశమే. కానీ ఇంటికి నెలకి పది పదిహేను ఖర్చు పెట్టలేని స్థితిలో వున్నారంటే మాత్రం నమ్మలేను. బీదరికానికి అసలు శుభ్రతకి సంబంధం ఏమిటి సార్. మనుష్యుల్లో సివిక్‌సెన్స్ లోపించడం వల్ల, ఇదంతా ప్రభుత్వం పని, బాధ్యత అనుకోడం వల్ల వచ్చిన అలసత్వం అంటాను. ప్రజలలో చైతన్యం తీసుకురావాలి ప్రభుత్వం - వారానికి రెండు సినిమాలు చూసే జనం ఒక సినిమా త్యాగం చేసి పరిసరాలు శుభ్రంగా వుంచుకోడానికి జనాన్ని అలవాటు చెయ్యడం ప్రభుత్వం పని అంటాను. ముందుగా కఠినంగా రూల్సు పెడితే కానీ ప్రజలు అలవాటుపడరు. ఏ పనికైనా ఆదిలో ప్రతిఘటన తప్పదు. ఓ మంచి పని చెయ్యడానికి ప్రభుత్వం కొన్నాళ్లు కఠినంగా వ్యవహరించక తప్పదు. సార్, మనది బీద దేశమే! ఈ ఎనభై కోట్ల మంది ప్రజలు తలొక రూపాయిచ్చినా ఎనభై కోట్ల రూపాయలతో ఊరిలో బస్‌స్టాండుల్లో, రైల్వే స్టేషన్సులో, బజార్లలో, నాలుగు రోడ్ల కూడలిలో యూరినల్స్, లావెట్రీలు కట్టించి విదేశాల్లో మాదిరి, ఏ వికలాంగులకో బాధ్యత అప్పగించి మనిషి దగ్గిర పావలా వసూలు చేసి అవి మెయిన్‌టైన్ చేసే పని అప్పగించచ్చు'' విమలాదేవి ఆవేశంగా మాట్లాడుతుంటే ముఖ్యమంత్రిగారు మధ్యలోనే నవ్వారు.

"మీరు విదేశాలు తిరిగి వచ్చి చాలా ఇంప్రెస్ అయిపోయారు. వినడానికి అంటే చాలా బాగుంది. అమలుపరచడం ఎంత కష్టమో మీకు అర్థంగాదు...''

"అర్థం అవుతుంది సార్, ప్రభుత్వం తల్చుకుంటే చెయ్యలేనిది ఏం వుండదు. ఎటొచ్చీ ఆ ప్రభుత్వంలో నిజాయితీ కొరవడకూడదు. మీరు అడిగితే ఓ మంచి పని కోసం డబ్బు ఇచ్చే ఉదారులు, పెద్దలు, ఇండస్ట్రియలిస్టులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో వున్నాయి. పెద్ద పెద్దవారు మీ పార్టీ ఫండులకి ఇచ్చే దానిలో పదో వంతు ఇచ్చినా ఈ పనులకి సరిపోతుంది సార్'' ఆవిడ మాటలకి ముఖ్యమంత్రి గారు మొహం మాడ్చుకున్నారు.

"చూడండి, అప్పుడే నెల రోజులుగా మా వీధిలో వున్న అందరూ తు.చ. తప్పకుండా నా మాట పాటిస్తున్నారు. వాళ్ల బంధువులు, స్నేహితులు వచ్చి చూసి మెచ్చుకుని తామూ అలా చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆ చుట్టుపక్కల కాలనీలకి, వీధులకి, వాడలకి ఊర్లో మహిళా మండలి సభ్యులందరినీ పిలిచి బోధపరిచి అందరిచేత చెప్పిస్తున్నాను. అందరం ఇళ్లకి వెళ్లి చెపుతూంటే సంతోషంగా ఒప్పుకుంటున్నారు - నాకు తెల్సిన బిజినెస్ పీపుల్ని, డబ్బున్నవారిని వారి వారి వీధుల్లో కొన్నాళ్లు జనం అలవాటుపడేవరకు ఫ్రీగా సంచులు పంచే ఏర్పాటు చేస్తున్నాను - మీరు తల్చుకుంటే ఏం చెయ్యలేరు, ప్రతివాళ్ల జీతంలో నూటికి ఒక రూపాయి చొప్పున ఒకటి రెండు నెలలు చందాగా ఇమ్మని ఆఫీసులని ఆదేశించండి - చందాలకి ప్రజలని, ధనవంతులని ముందుకు రమ్మని పేపర్లల్లో అభ్యర్థించండి. డబ్బు వచ్చి పడ్తుంది. ఎటొచ్చి ఈ పథకాలన్నీ ఇంప్లిమెంటు సజావుగా చేసే నిజాయితీ ప్రభుత్వంలో పెద్ద అధికారి నుండి చిన్న అధికారి వరకు కొరవడకుండా చూడాల్సిన పూచీ మీది...'' మరోసారి ముఖం మాడ్చుకున్నా, అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు కనక మొహం మీద నవ్వు పులుముకుని, "వెల్... మీ మాటలు వింటూంటే... మీలాంటివారు మా ప్రభుత్వంలో వుండాలనిపిస్తుంది. ఎన్నికలలో నిలబడి నెగ్గి, మున్సిపల్ అడ్మినేష్ట్రన్ మంత్రి అయ్యాక ఇదంతా మీ చేతుల మీదే జరిపిద్దురు గాని లెండి...'' హాస్యంగా నవ్వుతూనే ఎత్తిపొడిచారు.

"ఒక మంచి పని చెయ్యడానికి మంత్రులే అవనక్కరలేదు. స్వచ్ఛందంగా దేశానికి సేవ చెయ్యచ్చు. ఈ పదవుల మీద వ్యామోహంతోనో, పేరు కోసమో నేనీ పని చెయ్యడం లేదు. మన దేశం ఓ కుళ్లు గుంటలా వుండకూడదని, మిగతా దేశాల ముందు తల దించుకునే స్థితిలో వుండరాదన్నది నా తాపత్రయం'' ఆవిడ ఆయన వ్యంగ్యం అర్థం చేసుకునే జవాబిచ్చింది.

"అధికారం చేతిలో వుంటే తప్ప పనులు జరగవంటే, మీరు అవమంటే మంత్రి అవడానికి నాకేం అభ్యంతరం లేదు'' ఓ చురక అంటించింది.

• • •

ముఖ్యమంత్రిగారు హాస్యంగా అన్న మాట నిజమైంది. మరో ఐదు నెలలకే - ప్రభుత్వం పడిపోయి మధ్యంతర ఎన్నికలొచ్చాయి.

ఈ ఆరు నెలలలో విమలాదేవి చాలా పాప్యులర్ అయిపోయింది. ఆవిడ పేరు పేపర్లలో ప్రముఖంగా రాసాగింది తరచు. ఆవిడ వూర్లో పెద్ద పెద్ద బిజినెస్ మాగ్నట్స్‌ని పట్టుకుని చందాలు వసూలు చేస్తూ, మహిళా మండలి స్త్రీలని పట్టుకుని ప్రతి వాడ, ప్రతి వీధికి వెళ్లి, ప్రజలకి చెప్పు, ఒప్పిస్తూ, సంచులు పంచిపెడ్తూ ఊరి స్వరూపం కాస్తయినా మారడానికి కృషి చేయసాగింది. నాలుగైదు నెలల్లో ఆవిడ చేస్తున్న కృషి ఇటు ప్రజలలో, అటు పేపర్లలో, ప్రభుత్వంలో గుర్తింపు పొందింది. ఆవిడ పాప్యులారిటి ఢిల్లీ వరకు పాకింది. ముఖ్యమంత్రి హైకమాండ్ మీటింగ్‌లో ఆ నియోజక వర్గం ప్రతిసారి మాదిరి మరో పార్టీకి దక్కకుండా చెయ్యాలంటే విమలాదేవిని ఆ నియోజక వర్గంలో నిలబెడితే గెలుపు తప్పదని చేసిన ప్రతిపాదనని పార్టీ అధ్యక్షుడు ఆమోదించారు. విమలాదేవికి రాజకీయాల్లో దిగా

"అపరిణత మనస్కులైన మానవులకి స్వేచ్ఛనిస్తే ప్రమాదం కిందికి దారితీస్తుంది. పశుపాలన చేసినట్లుగానే మానవ జాతిని కూడా పాలించాలి. అయితే జ్ఞానాన్ని నీవు ఇవ్వగలిగిన రోజున అన్ని నిబంధనల్ని సడలించవచ్చును. సాధువైన మృగానికి స్వేచ్ఛగానీ, క్రూర జంతువులకు కట్టుకొయ్య అవసరం''

- డా॥ తెన్నేటి హేమలత

('మోహనవంశి'లో కృష్ణుడితో భీష్ముడు)

లని లేకపోయినా ఆ నియోజక వర్గంలో ప్రజలు, నాయకులు అందరి బలవంతం ఒక కారణం కాగా, తనేదన్నా సాధించాలంటే చేతిలో అధికారం వుండాలని ఆవిడా గుర్తించి పోటీకి నిలబడడానికి ఒప్పుకుంది.

అనుకున్నట్టే ఆవిడ, ఎప్పుడూ వచ్చే ఆ సీటు ప్రతిపక్ష పార్టీ సభ్యుడిని అధిక మెజారిటీతో ఓడించి గెలిచింది. ఎన్నో ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకున్న తనకు కాక అఖరి నిమిషంలో విమలాదేవికి పార్టీ టిక్కెట్ ఇవ్వడంతో ఓ సభ్యుడు విమలాదేవికి టిక్కెట్టిప్పించిన ముఖ్యమంత్రి మీద, పార్టీ అధ్యక్షుడి మీదా కోపంతో మిగతా అసమ్మతి వర్గంలో చేరిపోయి అవకాశం దొరికితే తన తడాఖా చూపాలని కాచుకు కూర్చున్నాడు. ఓ పక్కన చిత్తుగా విమలాదేవి చేతిలో ఓడిపోయిన ప్రతిపక్ష సభ్యుడు ఆమె మీద కక్ష సాధించే అవకాశం కోసం కాచుకుని కూర్చున్నాడు.

విమలాదేవికి అందరూ అనుకున్నట్టే మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ మంత్రి పదవి లభించింది. ఆమె కంటె ఎంతో సీనియర్ ఎమ్మెల్లేలకి చాలా కాలంగా వున్నా లభించని మంత్రి పదవి కాస్తా ఆమెకి ఇవ్వడం చాలా మందిలో అసంతృప్తిని రేకెత్తించింది. కన్నెర్ర అయింది.

విమలాదేవి మంత్రిగా ప్రమాణం స్వీకరించిన రోజు నుంచి ఒక్కరోజు కూడా వృథా చెయ్యకుండా ఊరిని సంస్కరించే రంగంలోకి దిగిపోయింది. అధికారులతో అనేక చర్చలు జరిపి, అనేక ప్రణాళికలు సిద్ధం చేసింది. వున్న సిబ్బందితో, వున్న లారీలతో , క్రషర్స్‌తో ఏఏ వార్డులలో ఏఏ రోజు చెత్త తీయాలో, వారానికి ఒకసారి ప్రకటించిన రోజులో తప్పక లారీ ఏ వీధికి వెళ్లాలో అన్న నోటీసులు తయారుచేసి ఊరంతా అంటింపజేసి, పేపర్లో, టి.వి.లో ప్రకటనలు ఇప్పించింది. మున్సిపాలిటి సిబ్బందిని సమావేశపరచి డ్యూటీ సక్రమంగా నిర్వహించని పనివారిమీద కఠిన చర్య తీసుకోబడ్తుందని, పని చక్కగా చేస్తే బోనస్‌లని ప్రకటించింది. తను ప్రతిరోజూ ఒక్కో వార్డులో తనిష్టం వచ్చిన వీధిలో స్వయంగా తిరిగి పనితీరు పర్యవేక్షిస్తానని, ఎక్కడన్నా సంచులు తీయలేదని కబురు అందితే క్షమించనని చెప్పింది. మరోపక్క ప్రతి మురికివాడలో మరుగు దొడ్లు, జనం తిరిగేచోట యూరినల్స్ కట్టించడానికి ప్లాన్లు, ఫండ్స్ కలక్ట్ చేయడం ఆరంభించింది.

రోజుకి పదహారు గంటలు పనిచేస్తూ ఒక్కో ప్రణాళిక అమలుపరచడానికి కృషి చేస్తూనే - మరో పక్క అమెరికాలో వున్న కొడుకుని ఇండియా వచ్చి ప్లాస్టిక్ సంచులు తయారుచేసే ఫ్యాక్టరీ పెట్టి ప్రజలకు సంచులు కాస్త చవకగా అందించాలని, కెమికల్ ఇంజనీరింగు, ఎం.బి.ఏ. చేసిన కొడుకు రావాలని ఫోన్ల మీద ఫోన్లు కురిపించింది. మంచి ఉద్యోగం, అమెరికా సుఖాలు వదులుకుని రానన్న కొడుకుని "నీ దేశం కోసం ఈ మాత్రం చెయ్యవా, అందరూ నీలా స్వసుఖమే చూసుకుంటే దేశం గతి ఏం కావాలి" అని చెప్పి, వాదించి ఊదరగొట్టి అఖరికి కొడుకు చేత ఊ అన్పించింది - కొడుకు వచ్చేలోగా ఫ్యాక్టరీకి కావల్సిన స్థలం, యంత్రాంగాలు అంటే తన పరపతి, పలుకుబడి వినియోగించి సమకూర్చి ఫ్యాక్టరీ ప్రారంభింపచేసింది.

అదే విమలాదేవి చేసిన పెద్ద పొరపాటని ఆవిడ ఆ రోజు గ్రహించలేకపోయింది!! ప్రజలకి సేవ చెయ్యాలన్న ఆరాటంతో, ప్లాస్టిక్ సంచులు చవకగా అందించి, ప్రజలని ఆకర్షించాలన్న తాపత్రయంతో ఆవిడ చేసిన ఈ పని ఆవిడ అంటే గిట్టని వారికి, ఆవిడ పాప్యులారిటీని సహించలేనివారికి ఆవిడని దెబ్బతీయడానికి అదే స్ట్రాంగ్ పాయింట్ అవుతుందన్నది ఊహించలేకపోయింది.

విమలాదేవి ఈ చేస్తున్నదంతా ప్రజల మీద ప్రేమతో, దేశం మీద భక్తితో చెయ్యడం లేదని కొడుకు చేత ఫ్యాక్టరీ పెట్టించి ప్లాస్టిక్ సంచులు ప్రజల చేత కొనిపించడానికి చేసిందనీ, లక్షలు ఆర్జించే ఉద్దేశంతో ఇదంతా చేస్తోందని టిక్కెట్టు దొరకని మాజీ ఎమ్మెల్యే ఓపక్క, ఆమె చేతిలో ఓడిపోయిన ప్రత్యర్థి మరో పక్క, చిన్న చిచ్చు అంటించారు. ఆ నిప్పురవ్వ రాజుకుని దావానంలా మారడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. అటు అపొజిషన్ పార్టీకి ఈ వార్త మంచి ఆహారం అయింది.

దానికి తోడు అటు ఆఫీసులో విమలాదేవి స్ట్రిక్ట్‌నెస్ వర్కర్స్‌కి చాలా ప్రాబ్లమ్ అయింది. ఇన్నాళ్లు ఇష్టం వచ్చిన రీతిలో పనిచేసిన వారు ఆవిడ ధాటికి తట్టుకోలేకపోయారు. ఏ రోజు ఏ వార్డుకి, ఏ వీధికి వస్తుందో తెలియకుండా వచ్చి తనిఖీ చేసి సరిగా లేకపోతే తీసుకునే కఠిన చర్య ప్రాణాంతకంగా తయారైంది. ఓ అరు నెలలు ఆవిడ తయారుచేసిన ప్రణాళికలని ఉత్సాహంగా "న్యూబ్రూమ్‌స్వీప్స్ క్లీన్" అన్నట్లు అమలుపరిచినా, రోజులు గడుస్తున్నకొద్దీ బద్ధకానికి, లంచాలకి అలవాటుపడ్డ స్టాఫ్‌కి ఆవిడ ఉనికి నచ్చలేదు. ఏ రోజు ఎవరు సస్పెండ్ అవుతారో తెలియని స్థితిలో పనిచేయడంతో ఆవిడ పట్ల విముఖత పెరగసాగింది.

ఇటు ప్రజలు - ఊరికే సంచులు ఇచ్చినన్నాళ్లు చెత్త సంచుల్లో ఎత్తిపెట్టిన ప్రజలు పదో ఇరవయ్యో ఖర్చు పెట్టి కొనడానికి గింజుకున్నారు. ఎవరూ చూడకుండా చెత్త డబ్బాల్లో పోసేయడం ఆరంభించారు - ఏ బజారులోనన్నా ఎవరన్నా యూరినల్స్ ఉపయోగించకుండా రోడ్డు మీద చేస్తే పది రూపాయలు ఫైన్ కలక్ట్ చేయడంతో ఈ ఆంక్షలు ప్రజలకి నచ్చలేదు... దానికి తోడు ఇదంతా విమలాదేవి కొడుకు చేత ఫ్యాక్టరీ పెట్టించడానికి చేస్తూందన్న వార్త జనానికి చేరడంతో ఆవిడ పట్ల గౌరవం తగ్గిపోసాగింది... జనం చెవులు కొరుక్కున్నారు. ఈ వార్త పేపర్లలో రావడానికి ఎక్కువ రోజులు పట్టలేదు - అటు వర్కర్స్ ఆవిడ ధాటికి తట్టుకోలేక 'వర్క్ టు రూల్'తో మొదలుపెట్టి స్ట్రయిక్ నోటీసులు ఇచ్చారు.

పేపర్లలో తన గురించిన వార్తలు చదివి విమలాదేవి దిగ్భ్రాంతి చెందింది. తనింత శ్రమ పడ్తూంటే, తన నిస్వార్ధ సేవకి జనం ఇచ్చిన నిర్వచనం విని చేష్టలుడిగిన దానిలా అయింది. వార్తలు చదివిన కొడుకు తల్లి మీద ఎగిరిపడ్డాడు. "చూశావా నీవు చేసిన సేవకి జనం వేసిన పూల మాలలు" అంటూ హేళన చేసి, 'ఇప్పటికయినా చాలించు నీ దేశ సేవ. అనవసరంగా నన్ను పిలిచావు' అంటూ దుయ్యబట్టి, ఇలాంటి దేశంలో ఒక్క క్షణం వుండనని, ఇదివరకు తను పనిచేసిన కంపెనీకి ఫోను చేసి వాళ్లు తిరిగి ఉద్యోగం ఇస్తాననడంతో నెల రోజులలో ఫ్యాక్టరీ మూసేసి అమెరికా వెళ్లిపోయాడు.

స్వంత లాభం కోసం, మంత్రిగా పలుకుబడి, అధికారం దుర్వినియోగం చేసి స్వప్రయోజనం కోసం లాండ్ అక్వైర్ చేసి ఫాక్టరీ పెట్టించిందని ఆరోపణలు చేశాయి అపోజిషన్ పార్టీలు. అటు అసమ్మతి వర్గం, ఇటు అపోజిషన్ ధాటికి తట్టుకోలేక ముఖ్యమంత్రి ఆవిడని సంజాయిషీ కోరాల్సి వచ్చింది. ఇటు ప్రజలు, వర్కర్సు అవసరాన్ని మించిన అధికారం చెలాయిస్తూ జులుము సాగిస్తుందన్న ఆరోపణలు ఓ ప్రక్క, పేపర్లలో ప్రముఖంగా వస్తున్న వార్తలు అన్నీ చదివిన విమలాదేవికి అవమానం కంటే బాధ ఎక్కువ అన్పించి ఈ కుళ్లు రాజకీయ వ్యవస్థ నుంచి తప్పుకోడం మినహా దారి లేదని ఆవిడ రాజీనామా చేసింది.

మరో నాలుగైదు నెలల్లో ఫాక్టరీ, ఇళ్లు, ఆస్థులు అన్నీ తెగనమ్మి ఆవిడా కొడుకు దగ్గరకు వెళ్లిపోయింది.

స్వేచ్ఛ దొరికిందన్నట్టు చక్కగా వీధులు అన్నీ చెత్తతో పొంగి పొర్లాయి. చెత్త కుప్పలన్నీ కన్నుల పండుగగా నిండిపోయాయి. యథా ప్రకారం పొంగి పొరలే డస్ట్‌బిన్నులతో ఊరు కళకళ్లాడిపోయింది.

ప్రేమ, వ్యాపారి ఉపయోగించే తరాజు కాదు. ప్రేమ బరువైందా లేక ప్రియుడు బరువైనవాడా అని తూచడానికి దానికి తక్కెళ్ళు ఉండవు. దానికి బేరం ఉండదు. కానీ త్రాసుకు ఉండే ముల్లు మాత్రం ఉంటుంది. ఆ ముల్లు నిరంతరం ప్రేమించిన హృదయాన్నే గాయపరుస్తూనే వుంటుంది.

- డా॥ వాసిరెడ్డి సీతాదేవి

('అగ్నిశిఖ'లో భావన సంఘర్షణ)